క్లుప్తంగా

రైలు పట్టాలపై వర్షం నీరు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): భారీ వర్షంతో కొండపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని లోబ్రిడ్జి వద్ద రైల్వే పట్టాలపై వర్షంనీరు నిలిచింది. ఎన్టీటీపీఎస్‌కు బొగ్గు రవాణా చేసే రైళ్లకు ఏర్పాటు చేసిన ప్రత్యేక పట్టాల కింద వర్షం నీటి తాకిడికి కంకరు కొట్టుకుపోయింది. సికిందరాబాద్ వైపు వెళ్లే పలు రైళ్లకు అంతరాయం కలిగింది. రైల్వే అధికారులు, సిబ్బంది నీటిని బయటకు పంపే చర్యలు చేపట్టారు.

పునరావాస కేంద్రాల ఏర్పాటు

విజయవాడరూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి, గొల్లపూడి, జక్కంపూడి కాలనీ, కంద్రికలో నాలుగు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ బి.సుగుణ ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించడంతో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. ముంపు ప్రాంతాల్లోని కుటుంబాలను ఖాళీ చేసి వారిని పునరావాస కేంద్రాలకు తరలించనున్నామని వివరించారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

నీట మునిగిన బీసీ కాలనీ



జి.కొండూరు: పులివాగు ఉధృతి పెరిగిపోవడంతో జి.కొండూరు బీసీ కాలనీ పూర్తిగా నీట మునిగింది. వందల నిరుపేదల కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పొట్ట చేతబట్టుకొని సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారు. తమతో పాటు తాము అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న మూగజీవాలను సైతం తమ వెంట తీసుకెళ్లారు. మూడు దశాబ్దాలుగా తామెప్పుడూ ఇటువంటి వరద ఉధృతి చూడలేదని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

జి.కొండూరు: మండల పరిధిలోని కుంటముక్కల, కొత్తూరు, వెలగలేరు, పినపాక గ్రామాలలోని లోతట్టు ప్రాంతాలలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు నాలుగు గ్రూపులుగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగి 50 మందికి పైగా ప్రజలను కాపాడారు. పినపాక గ్రామ శివారులో నిర్వహిస్తున్న పుట్టగొడుగుల ఫారంలో పనిచేసే 10 మంది పులివాగు వరద ఉధృతికి అక్కడే చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది వారిని రెస్క్యూ చేసి కాపాడారు.

వెండి తొడుగు సమర్పణ

తిరువూరు: స్థానిక కోదండ రామాలయంలోని ఆంజనేయస్వామికి దాతలు వెండి తొడుగును శనివారం సమర్పించారు. వెండి తొడుగును స్వామివారికి అలంకరించి తిరువంజన కార్యక్రమం నిర్వహించారు. దాతలు నాగుబండి జగదీష్, రమేష్, మంగతాయారు, జవాజి శ్రీనివాసరావు, బోనగిరి గుర్నాథరావు, జూలూరి వెంకటరమణయ్య, దోసపాటి కృష్ణ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థినుల తరలింపు

తిరువూరు: భారీవర్షాల కారణంగా తిరువూరులోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ప్రభుత్వ భవనంలో నిర్వహిస్తున్న 2వ నెంబర్ బాలికల వసతిగృహంలో విద్యార్థినులను, అశోక్‌నగర్‌లోని కడియాల నాగేశ్వరరావు ఆస్పత్రి రోడ్డులో ప్రైవేటు అద్దె భవనంలో నిర్వహిస్తున్న బాలికల వసతిగృహంలో బాలికలను జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు తరలించారు. వసతిగృహాల బాలికలకు అన్ని సదుపాయాలు కల్పించాలని వార్డెన్లను ఆర్డీఓ ఆదేశించారు.

గురుకుల విద్యార్థుల తరలింపు

జి.కొండూరు: కుంటముక్కల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో ఉన్న 600 మంది విద్యార్థినులను చెవుటూరు జెడ్పీ హైస్కూల్‌కు తరలించారు. ఈ రాత్రికి విద్యార్థులకు అక్కడే బస ఏర్పాట్లను చేశారు. సమీప గ్రామాలకు చెందిన పలువురు విద్యార్థినులను తల్లిదండ్రులు తమ ఇళ్లకు తీసుకెళ్లారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటన

ఇబ్రహీంపట్నం: భారీ వర్షాలతో నీటి ముంపుకు గురైన ఖాజీమాన్యం ప్రాంతంలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు శనివారం పర్యటించారు. వరద ముంపుకు గురైన ప్రజలను పరామర్శించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

స్కూటీ చోరీపై ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం: ఇంటి వద్ద నిలిపి ఉంచిన స్కూటీ చోరీకి గురైంది. సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీటీపీఎస్‌లో ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న ఆలపాటి శివనాగేశ్వరరావు స్థానిక ఐశ్వర్య గ్రాండ్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. ఈనెల 26 రాత్రి ఇంటి ముందు ఉంచిన స్కూటీ తెల్లవారే సరికి కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

90 శాతం పింఛన్ల పంపిణీ

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం 90 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీఓ దుర్గాప్రసాద్ తెలిపారు. మండలంలో 8,463 మంది పింఛనుదారులు ఉండగా 7,637 మందికి పింఛన్లు పంపిణీ చేశామని చెప్పారు.

కుండపోత

- భారీ వర్షంతో స్తంభించిన జనజీవనం
- పొంగుతున్న వాగులు
- పలు గ్రామాలకు రాకపోకల నిలిపివేత
- అత్యవసర సేవలకు రెవెన్యూ అధికారులు సిద్ధం

జి.కొండూరు/ తిరువూరు/నూజివీడు: తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరపి లేని వర్షం కురిసింది. వాగులు పొంగిపొర్లుతున్నాయి. పలు కాలనీల్లో వర్షం నీరు చేరింది. రోడ్లపై నీరు ప్రవహిస్తోంది. పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. జనజీవనం స్తంభించింది.

తిరువూరు మండలంలోని మల్లేల-లక్ష్మీపురం, వావిలాల-మునుకుళ్ల, అక్కపాలెం-తిరువూరు, చౌటపల్లి-జీకొత్తూరు గ్రామాల మధ్య వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. పడమటివాగు, అలుగువాగు, కట్టలేరు, కొండవాగులకు ఎగువ నుంచి వరద పెరుగుతుండటంతో ముందు జాగ్రత్తగా పోలీసు, రెవెన్యూ అధికారులు కాపలా ఉన్నారు. తిరువూరు పట్టణంలోని చింతలకాలనీ, సుందరయ్య కాలనీ, రాజుపేట కొత్త కాలనీ, డ్రైవర్స్ కాలనీలలో నివాసగృహాల మధ్య, రోడ్లపైన వర్షం నీరు నిలిచిపోయింది. పలు నివాస గృహాల్లోకి నీరు ప్రవేశించింది. కోకిలంపాడు, మునుకుళ్ల, అక్కపాలెం, చౌటపల్లి, గానుగపాడు గ్రామాల్లో వరిచేలు నీట మునిగాయి. తిరువూరు-విస్సన్నపేట రహదారిలో పలు చోట్ల భారీవృక్షాలు నేలకొరిగాయి. తిరువూరు మండలంలో 89 మిల్లీమీటర్లు, గంపలగూడెంలో 127.4 మిల్లీమీటర్లు, విస్సన్నపేటలో 88.2 మి.మీ., ఎ.కొండూరులో 127.4 మి.మీ., రెడ్డిగూడెంలో 100.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అత్యవసర సేవలకు రెవెన్యూ అధికారులు సిద్ధం

తిరువూరు డివిజన్‌లో అత్యవసర సహాయం అందించేందుకు తహసీల్దార్ కార్యాలయాల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశామని రెవెన్యూ డివిజినల్ అధికారి మాధవి తెలిపారు. ఎ. కొండూరు తహసీల్దార్ కార్యాలయ హెల్ప్‌లైన్ సెల్: 99086 64627, గంపలగూడెం సెల్: 99086 64628, రెడ్డిగూడెం సెల్: 99086 64622, తిరువూరు సెల్: 98499 03970, విస్సన్నపేట సెల్: 99086 64620 నంబర్లకు ఫోన్ చేసి అత్యవసర సేవలు పొందవచ్చని సూచించారు.

రాయనపాడు చప్టాపై వరద ప్రవాహం

రాయనపాడు(విజయవాడరూరల్): బుడమేరు వరద ప్రవాహం రాయనపాడు గ్రామాన్ని తాకింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శనివారం ఉదయం గ్రామంలోని బుడమేరు కాల్వలోకి బుడమేరు వరద నీరు చప్టాపైకి చేరుకోవడంతో రాయనపాడు గ్రామం నుంచి పైడూరుపాడు, కవులూరు ఆపై గ్రామాలకు రాకపోకలకు అంతరాయ కలిగింది. వెలగలేరు వద్ద బుడమేరు రెగ్యులేటర్ గేట్లు ఎత్తివేయడంతో బుడమేరు వరద మరింత పెరిగే అవకాశం ఉంది. రాయనపాడు, పైడూరుపాడు, జక్కంపూడి, షాబాదు, కొత్తూరు తాడేపల్లి గ్రామాల్లో వరి పంట పొలాలు ముంపులోనే ఉన్నాయి. మరో రెండు రోజుల పాటు అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు చేయడంతో వర్షానికి తోడు బుడమేరు వరద ప్రవాహానికి పంటలకు నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రెండు చెరువులకు గండ్లు

గంపలగూడెం: భారీవర్షానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు అధికంగా వచ్చి చేరడంతో గంపలగూడెం మండలంలోని రెండు చెరువులకు గండ్లు పడ్డాయి. వినగడప రాళ్లచెరువు, పెనుగొలను నల్ల చెరువులకు గండ్లు పడి వరద నీరు పంట పొలాలను ముంచెత్తింది. ఆయా చెరువు ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

పొంగిపొర్లుతున్న వాగులు

గంపలగూడెం మండలంలో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు ఏకధాటిగా కురిసిన అతి భారీ వర్షంతో మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ప్రధాన నీటివనరైన కట్టలేరులో వరదనీరు పరవళ్లు తొక్కుతోంది. తోటమూల- వినగడప నడుమ ఏటిపై ధ్వంసమైన వంతెన వద్ద రాకపోకల కోసం నిర్మించిన డైవర్షన్ రహదారిపై నాలుగు అడుగుల ఎత్తుకు పైగా వర్షం నీరు ప్రవహిస్తోంది. దీంతో పోలీస్, రెవెన్యూ అధికారులు గంపలగూడెం -నూజివీడు, విజయవాడ రహదారిలో రాకపోకలను నిలిపివేశారు. ఇటీవలనే 15 రోజులపాటు వరద కారణంగా ఏటిపై రాకపోకలు నిలిచిపోగా మళ్లీ ఏర్పడిన పరిస్థితితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గంపలగూడెం- తిరువూరు ఆర్ అండ్‌బీ ప్రధాన రహదారిలో అలుగువాగు, గుర్రపు వాగు, తోటమూల- కంచికచర్ల రహదారిలో మెగ్గిళ్ల వాగు, మేడూరు-సొబ్బాల నడుమ వాగు, ఊటుకూరు-నెమలి ఆర్‌అండ్‌బీ రహదారిలో నెమలి వాగు, ఊటుకూరు వాగు, కొత్తపల్లి కొండవాగుల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆయా రహదార్లపై రాకపోకలు నిలిచాయి. మండలం కేంద్రమైన గంపలగూడెంకు మూడు పక్కల రహదారుల్లో వాగుల కారణంగా రాకపోకలు స్తంభించాయి. తెలంగాణ రాష్ట్రం మధిరకు మాత్రమే ప్రస్తుతం రహదారి సౌకర్యం ఉంది. కట్టలేరు, మండలంలోని వాగులు, వంకల వెంట పరీవాహక ప్రాంతంతోపాటు వరి పొలాలు, పత్తి చేలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

గ్రామాలు, పట్టణాలు జలమయం

ఇబ్రహీంపట్నం: అల్పపీడన ప్రభావంతో మండలం పరిధిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం కుండపోతగా కురిసిన వర్షంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మండలం పరిధి గ్రామాలతో పాటు ఇబ్రహీంపట్నం, కొండపల్లి పట్టణాలు జలమయయ్యాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పలు కాలనీలు, వీధుల్లోకి వర్షంనీరు చేరింది. జనజీవనం స్తంభించిపోయింది. కొండపల్లిలో కొండవాగు పొంగడంతో 30వ నంబర్ జాతీయ రహదారి, పట్టణ ప్రధాన రహదారితో పాటు వీధుల్లో వర్షం నీరు పొంగి ప్రవహించింది. ఎస్టీ కాలనీలో నడుంలోతు నీళ్లు చేరాయి. వీధులన్నీ జలమయం కావడంతో ఇళ్లల్లోకి నీళ్లు చేరాయి. ఇంట్లో వస్తు సామగ్రి భద్రపర్చుకునేందుకు ప్రజలు అవస్థలు పడ్డారు. గజరాజు చెరువు పొంగిపొర్లడంతో పక్కనే ఉన్న వరికూటి కోటయ్య నగర్‌లో నీళ్లు చేరాయి. ఇబ్రహీంపట్నంలో జాకీర్ హుస్సేన్ కళాశాల రోడ్డులో రాకపోకలు స్తంభించాయి. ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలు నీటి ముంపునకు గురయ్యాయి. ఖాజీమాన్యం కాలనీలో నడుంలోతు నీళ్లు పట్టాయి. కొందరు ఇళ్లకు చేరేందుకు నీళ్లల్లో ఈదాల్సిన పరిస్థితి నెలకొంది.



కొట్టుకుపోయిన లక్షల విలువైన చేపలు

రాళ్ల చెరువుకు గండిపడటంతో చెరువులో కొట్టుకుపోతున్న చేపలను చూపుతున్న దృశ్యం

గంపలగూడెం: వినగప రాళ్లచెరువు గండి కారణంగా చెరువులో రెండేళ్లుగా పెంచిన చేపలు కొట్టుకుపోయాయి. లక్షల్లో నష్టం జరుగుతుందని రైతు మీసాల కోటిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపల్లి గ్రామం నడిబొడ్డున ఉన్న కొండవాగు ఉధృతి కారణంగా నీరు ఊరులోకి చేరడంతో గ్రామస్తులు ఇబ్బందులకు గురయ్యారు.



కుంటముక్కల, వెంకటాపురం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై వరద ప్రవాహం

ఎమ్మెల్యే వసంత పర్యటన



కొండపల్లి ఎస్టీ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

నీటి ముంపునకు గురైన కొండపల్లి ప్రాంతాల్లో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పర్యటించారు. కొండపల్లి ఎస్టీ కాలనీ, ఆర్సీఎం కాలనీ, కుమ్మరి బజార్ ప్రాంతంలో పర్యటించి నీటి ముంపునకు గురైన ప్రజలకు ధైర్యం చెప్పారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఇళ్లల్లో ఉన్న వారికి ఆహారం, తాగునీరు అందించాలన్నారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నం వివిధ గ్రామాల్లో పంట పొలాలు నీటి ముంపునకు గురయ్యాయి.

ఒకవైపే రాకపోకలు

ఆర్టీసీ డిపో ప్రాంగణం నీటి ముంపునకు గురైంది. 65వ నంబర్ జాతీయ రహదారిపై జూపూడి, కిలేశపురం వద్ద నీళ్లు చేరడంతో హైవే అధికారులు ఒక వైపు వాహనాలు నిలిపివేసి ఒన్‌వే ట్రాఫిక్ ఏర్పాటు చేశారు. పలు ఆలయాలు, పాఠశాలల్లోకి వర్షం నీరు చేరింది.

నూజివీడు పెద్ద చెరువుకు గండ్లు

నూజివీడు: నూజివీడు పట్టణానికి ఆనుకొని ఉన్న పెద్ద చెరువుకు శనివారం రెండు చోట్ల గండ్లు పడటంతో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం నుంచి నూజివీడు పట్టణంతో పాటు మండలంలో కురిసిన భారీ వర్షంతో పెద్ద చెరువుకు పెద్దఎత్తున వరదనీరు వచ్చి చేరింది. కొత్తూరు తండా బస్టాండు వద్ద ఉన్న మల్లయ్యకుంట కూడా తెగడంతో ఆ చెరువులోని వరదనీరంతా పెద్ద చెరువుకు వచ్చి చేరింది. దీంతో పెద్ద చెరువును ఆనుకొని ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం పక్కన, విస్సన్నపేట రోడ్డులో ఇక్లాస్ స్కూల్ సమీపంలో రెండు గండ్లు పడ్డాయి. అమ్మవారి ఆలయం పక్కన చిన్న గండి మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో పడగా, ఇక్లాస్ స్కూల్ సమీపంలో చిన్నగండి పడి మట్టికొసుకు పోతూ సాయంత్రం ఐదు గంటల తరువాత పెద్దదిగా మారింది. దీంతో 200 ఎకరాలపైగా విస్తీర్ణం ఉన్న చెరువులోని వరదనీరంతా గండ్ల ద్వారా ఉధృతంగా ప్రవహిస్తోంది. పట్టణంలోని 30వ వార్డులో 100 గృహాలకు పైగా నీటి ముంపునకు గురయ్యాయి. పెద్ద చెరువు కింద రైతులు సాగుచేసిన 300 ఎకరాలకు పైగా వరిపైరు ముంపునకు గురైంది.

నిలిచిన రాకపోకలు

ఈ రెండు గండ్ల ద్వారా వరదనీరు నూజివీడు-విస్సన్నపేట రహదారిపైన, బైపాస్ రోడ్డుపైన మోకాలి లోతు పైన ప్రవహిస్తుండటంతో నూజివీడు-విస్సన్నపేట మార్గంలోనూ, హనుమాన్‌జంక్షన్-విస్సన్నపేట మార్గంలోనూ రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఊటవాగు, రామిలేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నూజివీడు-మునుసూరు, నూజివీడు-ఏలూరు (వయా కొప్పాక) మార్గంలోనూ, నూజివీడు- మడిచర్ల, మీర్జాపురం-గోపవరం మార్గాల్లో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఏలూరు ఎస్పీ కొమ్మి శివప్రతాప్ కిషోర్ అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

వాగులను తలపించిన రోడ్లు

నూజివీడు: భారీ వర్షానికి నూజివీడు పట్టణంలోని రోడ్లు వాగులను తలపించాయి. మైలవరం రోడ్డు, ఏరియా ఆసుపత్రి రోడ్డు జలమయమైంది. భారీ వాహనాలు తప్ప కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం అర్ధ రాత్రి నుంచి శనివారం సాయంత్రం 5 గంటల వరకు నూజివీడులో 187.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ భారీ వర్షానికి పల్లపు ప్రాంతాల్లోకి వరదనీరు వచ్చి చేరింది. నియోజకవర్గంలో 740.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

మునునూరు/చాట్రాయి: ముసునూరు మండలంలో సగభాగంపైగా వ్యాపించి ఉన్న సంధ్యపు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెక్కపల్లి పెద్ద చెరువు సప్లయ్ ఛానల్ స్థానికంగా ఉన్న ఓ పాఠశాలను, రెండు కాలనీలను ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. పలు నివాసాల్లోకి వర్షం నీరు చేరింది. పంట పొలాల్లోకి వర్షం నీరు చేరింది. చాట్రాయి మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు ఎడతెరిపిలేకుండా వర్షం పడింది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి. చెరువుల్లో స్వల్పంగా నీరు చేరింది.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కుంపినీ వాగు ప్రమాదకరంగా ప్రవహించడంతో ఆగిరిపల్లి, నూగొండపల్లి, చిన్నాగిరిపల్లి, తోటపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఆగిరిపల్లి విజయవాడ ప్రధాన రహదారిపై కుంపినీ వాగు నాలుగు అడుగుల మేర ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. వడ్లమాను పెదవాగు బైక్‌పై ఇద్దరు యువకులు వరద ఉధృతికి నీటిలో కొట్టుకుపోతుండగా స్థానికులు వారిని కాపాడారు. కొత్త ఈదరలోని కుంపని వాగులో భార్యాభర్తలు చిక్కుకున్నారు. తహసీల్దార్ ప్రసాద్ సహాయక చర్యలు చేపట్టి వారిని రక్షించారు.



తిరువూరు-విస్సన్నపేట రహదారిలో కూలిన భారీవృక్షం



కొత్తూరు తాడేపల్లి గ్రామంలో నీట మునిగిన వరి పొలాలు



తిరువూరు బాలికోన్నత పాఠశాలలో ఆశ్రయం పొందిన హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మాధవి



తిరువూరు మండలం మల్లేల వద్ద వరద నీటి ఉధృతితో ట్రాఫిక్ నియంత్రిస్తున్న పోలీసులు



నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు



ముసునూరు మండలం చెక్కపల్లి సెంటర్‌లో ప్రవహిస్తున్న వరదనీరు



కొండపల్లి 30వ నంబర్ హైవేపై ప్రవహిస్తున్న వర్షం నీరు



ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో చేరిన వర్షం నీటిలో నిలిచిన బస్సులు



నూజివీడు బైపాస్ రోడ్డుపై పారుతున్న వరద నీరు



నూజివీడు వయా ముసునూరు ఏలూరు మార్గంలో ఊటవాగు ఉధృతి



వరదనీటి ముంపునకు గురైన ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహం

వాగుల ఉగ్రరూపం

- సురక్షిత ప్రాంతాలకు సమీప ప్రాంత వాసుల తరలింపు
- నీట మునిగిన పంట పొలాలు
- వాగుల వద్ద పోలీస్ పికెట్ల ఏర్పాటు

జి.కొండూరు: చిన్నపాటి జల్లులతో శుక్రవారం ఉదయం ప్రారంభమైన వర్షం శనివారం కూడా కొనసాగింది. శుక్రవారం రాత్రి నుంచి వర్షం తీవ్రత పెరిగింది. శనివారం భారీ వర్షం కురవడంతో జి.కొండూరు మండలంలోని వాగులు ఉగ్రరూపం దాల్చాయి. పులివాగు, బుడమేరువాగు, దొర్లింత వాగు, కప్పలవాగు, తొమ్మండ్రం వాగు, కొండవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ వాగులను ఆనుకొని నివసిస్తున్న వారిని ఇప్పటికే సురక్షిత ప్రాంతలకు తరలించారు. ఈ వాగుల వద్ద రాకపోకలను నిలిపివేసిన పోలీసులు ఆయా వాగుల వద్ద ప్రత్యేక పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు. బుడమేరు, పులివాగు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండడంతో సమీప గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షిస్తూ ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు పాటిస్తున్నారు.

స్తంభించిన జనజీవనం

చిన్నపాటి జల్లులతో శుక్రవారం ఉదయం ప్రారంభమైన వర్షం రెండు రోజుల పాటు శనివారం కూడా ఎడతెరిపిలేకుండా కురవడంతో జి.కొండూరు మండల పరిధిలో జనజీవనం స్తంభించిపోయింది. రహదారులు, డ్రెయినేజీలు, వాగులు, వంకలు, వ్యవసాయ భూములు, జాతీయ రహదారులు అనే తేడా లేకుండా అన్నీ కలిసిపోయి వరదనీరు ప్రవహించడంతో గ్రామాలన్నీ అతలాకుతలం అయ్యాయి. పలు చోట్ల ఇళ్లల్లోకి వరదనీరు చేరింది. విద్యుత్ సౌకర్యం లేక గ్రామీణ ప్రాంత ప్రజలు నరకయాతన అనుభవించారు. పలు గ్రామాలలో లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలను పోలీసులు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ముంపుబారిన విద్యుత్ సబ్‌స్టేషన్

వెంకటాపురం వాగు పొంగిపొర్లడంతో కుంటముక్కల విద్యుత్ సబ్‌స్టేషన్ వరద ముంపునకు గురైంది. కుంటముక్కల, వెంకటాపురం, చెవుటూరు, గుర్రాజుపాలెం, వెల్లటూరు, కోడూరు, చిన్న నందిగామ, భీమవరప్పాడు, సీతారాంపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. జి.కొండూరు మండల పరిధిలో ముఖ్యంగా సాగవుతున్న 4,700ఎకరాలలో వరి, 5,200ఎకరాలలో పత్తి నీట మునిగింది.



వెల్లటూరు వద్ద ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న బుడమేరు



వరద ముంపునకు గురైన వెల్లటూరు గ్రామం



ముంపునకు గురైన కుంటముక్కల విద్యుత్ సబ్‌స్టేషన్



హెచ్. ముత్యాలంపాడు వద్ద బుడమేరు వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎస్ఐ సతీష్‌కుమార్



కుంటముక్కల గురుకుల పాఠశాల నుంచి విద్యార్థినులను ట్రాక్టర్‌లో తరలిస్తున్న అధికారులు



పులివాగు వరదలో చిక్కుకున్న కూలీలను కాపాడిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది



కుంటముక్కల గ్రామంలో చేరిన వరదనీరు

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ పూడికతీత పనులు

సమావేశంలో కౌన్సిలర్ల అసంతృప్తి

తిరువూరు: తిరువూరు పట్టణంలో డ్రెయినేజీల పూడికతీత పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని నగర పంచాయతీ కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అధ్యక్షతన జరిగింది. రూ.29 లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ పూడికతీత పనులపై అధికారుల పర్యవేక్షణ కరువైందని, టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం ఆ పనుల వైపు కన్నెత్తి చూడకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారం నిర్వహిస్తున్నారని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. పలుచోట్ల పూడిక తీయకుండానే పనులు పూర్తయినట్లు చెబుతున్నారని, మెయిన్‌రోడ్డులో అధికశాతం వ్యాపారులు తమ సొంత ఖర్చుతో డ్రెయినేజీ పూడిక తీసుకున్నారని కౌన్సిలర్లు పేర్కొన్నారు. ఇకనైనా నగర పంచాయతీ అధికారులు పూడిక తీత సక్రమంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రహదారిపై రాళ్లు, బురద, మట్టి తొలగించకపోవడంతో వాహనాల రాకపోకల సందర్భంగా దుకాణదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వెంటనే తొలగించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో తాగునీటి సరఫరా, రహదారుల నిర్మాణం తదితర అంశాలపై కౌన్సిల్ సమావేశంలో చర్చించారు. కమిషనర్ లోవరాజు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంపునకు కృషి

నూజివీడు: నియోజకవర్గంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంపునకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని పోతిరెడ్డిపల్లిలో శనివారం రైతులకు సబ్సిడీపై పామాయిల్ మొక్కలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రస్తుతం 15 వేల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగవుతోందని, ఈ ఏడాది మరో 2 వేల హెక్టార్లలో పెంపు లక్ష్యంగా మొక్కల పంపిణీ చేపట్టామని వివరించారు.

ఎంపీడీఓ శంకరరావుకు సన్మానం

ఆగిరిపల్లి: ఉద్యోగ విరమణ చేసిన ఎంపీడీఓ శంకరరావును పలువురు ఉద్యోగులు, నాయకులు ఘనంగా సత్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ శంకరరావు సేవలను కొనియాడారు. ఈఓపీఆర్డీ శేఖర్, మెడికల్ ఆఫీసర్ జగన్‌మోహన్‌రావు, ఏఓ అబ్దుల్ సలాం, ఎంఈఓలు పాల్గొన్నారు.

వరద బాధితులకు అన్నదానం

ఇబ్రహీంపట్నం: ప్రసాద్‌నగర్‌లో వరద ముంపునకు గురైన వంద మంది బాధిత కుటుంబాలకు కొండపల్లి షాబూఖారీ దర్గా ఆస్థాన పీఠాధిపతి మహ్మద్ అల్తాఫ్ రజా శనివారం అన్నదానం చేశారు. వర్షంలో ఆహారం కోసం ఇబ్బందులు పడుతున్న వారు మహ్మద్ అల్తాఫ్ రజాను సెల్: 98483 34075 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.